మాజీ ఎంపీపీ కుటుంబానికి పరామర్శ



కొండపాకలో మాజీ ఎంపీపీ శారద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేషన్ మాజీ చైర్మన్లు ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్ తదితరులు

కొండపాక(కుకునూరుపల్లి), సెప్టెంబర్ 11 : కొండపాక మాజీ ఎంపీపీ అనంతుల శారద ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. బుధవారం కొండపాకలో జరిగిన మాజీ ఎంపీపీ శారద దశదినకర్మ కార్యక్రమానికి కార్పొరేషన్ మాజీ చైర్మన్లు వంటేరు ప్రతాప్‌రెడ్డి, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్ హాజరై ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించడంతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. భారత జాగృతి రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్, మాజీ ఎంపీపీ రాధాకిషన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాములు, యాదగిరి, హైమద్ పాల్గొన్నారు.

క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయాలి

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మండల నోడల్ అధికారి రమేశ్

కొమురవెల్లి, సెప్టెంబర్ 11 : క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయాలని మండల నోడల్ అధికారి బి.రమేశ్ అన్నారు. బుధవారం మండలంలోని ఐనాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి పి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో భాగంగా అండర్ 14, అండర్ 17 బాలబాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలు నిర్వహించారు. అందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక చేయడంతో పాటు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జే.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ క్రీడల మండల సెక్రటరీ శివానీ, పీఈటీ నర్సింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మద్దూరులో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న చేర్యాల సీఐ శ్రీను

మద్దూరు(ధూళిమిట్ట), సెప్టెంబర్11: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చేర్యాల సీఐ ఎల్. శ్రీను సూచించారు. బుధవారం మద్దూరు పీఎస్‌లో ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై మండలంలోని ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో ఎక్కిన మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోలను రోడ్లకు అడ్డదిడ్డంగా పార్కు చేయరాదన్నారు. డ్రైవర్లు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. ఆటో డ్రైవర్లు యూనిఫామ్ ధరించాలన్నారు. ఆటోల గుర్తింపు కోసం త్వరలో అభయ యాప్ స్టిక్కర్లు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై షేక్ మహబూబ్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

గజ్వేల్, సెప్టెంబర్ 11: మద్యం తాగి వాహనాలు నడిపిన వారిని బుధవారం గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి గజ్వేల్ కోర్టులో హాజరుపర్చారు. పట్టణంలోని తూప్రాన్, పిడిచేడ్, సంగాపూర్, ప్రజ్ఞాపూర్, జాలిగామ, మూర్తాజ్‌పల్లి రోడ్డులో వాహనాల తనిఖీలో పట్టుబడిన 15 మందికి జడ్జి ప్రియాంక రూ.30వేల జరిమానా విధించారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

కోహెడలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ సురేఖ

కోహెడ, సెప్టెంబర్ 11: మండలంలోని 11మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కె.సురేఖ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంద ధర్మయ్య, బందెల బాలకిషన్, భీంరెడ్డి తిరుపతిరెడ్డి, తిరుపతి, వెంకటస్వామి పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలి

చేర్యాల పట్టణంలోని కుడి చెరువును సందర్శించిన అధికారులు

చేర్యాల,సెప్టెంబర్ 11 : వినాయక చవితి సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే కుడి చెరువును సీఐ శ్రీను, మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణీశ్రీధర్‌రెడ్డి, కమిషనర్ నాగేందర్, తహసీల్దార్ సమీర్ హైమద్ ఖాన్, ఎస్సై నిరేష్, ఆర్ఐ రాజేందర్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీను మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. వినాయక నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. వినాయక నిమజ్జనానికి వచ్చే వాహనాలకు పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సంప్రదాయ బద్ధంగా..

వినాయక నిమజ్జనం రోజు ఆర్గనైజర్ సభ్యులు, భక్తులతో కలిసి సంప్రదాయ బద్ధంగా భక్తి, దేవుడి పాటలు పాడుకుంటూ నిమజ్జనం పూర్తి చేయాలని చేర్యాల సీఐ శ్రీను సూచించారు.మండలంలోని ఆకునూరులో మంగళవారం రాత్రి గ్రామ వినాయక మండపాల ఆర్గనైజర్లు, కార్యవర్గ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని, మద్యం తాగి గణేశ్ నిమజ్జనంలో పాల్గొనవద్దన్నారు. చెరువులు నిండుగా ఉన్నాయని, జాగ్రత్తగా ఉండాలని, పోలీసుల సూచనలు పాటించాలని కోరారు.

వినాయకుడికి 200 మహా నైవేద్యాలు

చేర్యాలలో వినాయకుడికి మహిళలు సమర్పించిన మహా నైవేద్యాలు

చేర్యాల, సెప్టెంబర్ 11 : పట్టణంలోని వైశ్య భవన్‌లో పట్టణ అర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి 200 మహా నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారి పూజల సందర్భంగా వైశ్య సామాజికవర్గానికి చెందిన మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో తయారు చేసి మహా నైవేద్యాలను సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. పట్టణ వైశ్య సంఘం అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్, కార్యదర్శి ఉప్పల నాగరాజు, కోశాధికారి తెరాల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు మంచాల ఆంజనేయులు, యువజన విభాగం అధ్యక్షుడు ఒరుగింటి శ్రీకాంత్, కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్, మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎన్నికైన నూతన కార్యవర్గం

చేర్యాల, సెప్టెంబర్ 11 : లైట్ మోటర్స్ డ్రైవర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను సర్కారు పరిష్కరించాలని చేర్యాల ది లైట్ మోటర్స్ డ్రైవర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఆడెపు మహేశ్, అధ్యక్షుడు పచ్చిమడ్ల మహేందర్ కోరారు. బుధవారం పట్టణంలో చేర్యాల లైట్ మోటర్స్ డ్రైవర్స్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. గౌరవ అధ్యక్షుడిగా ఆడెపు మహేశ్, అధ్యక్షుడిగా పచ్చిమడ్ల మహేందర్, ఉపాధ్యక్షులుగా సాతెల్లి దేవయ్య, మాచర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా యాట కనకయ్య, గౌరవ సలహాదారుడిగా పాక బాలయ్య, కోశాధికారిగా పసుల సంతు, సహాయ కార్యదర్శులుగా ఎండీ మాలిక్, పాక శ్రీనివాస్, సభ్యులుగా ఎండీ బాషీమియా, కర్నె కరుణాకర్, శివ, శ్రీరామ్ రమేశ్, ముస్త్యాల మహేందర్, భాస్కర్, సుజ్జు ఎన్నికయ్యారు. సమావేశంలో రాచకొండ శ్రీనివాస్, తాటిపాములు పరశురాములు, చీర్ల మురళి పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

- కలెక్టర్ మనుచౌదరి
- కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో ఆకస్మిక పర్యటన



మర్పడగ ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీలో పౌష్టికాహారంపై సూచనలు చేస్తున్న కలెక్టర్ మనుచౌదరి

కొండపాక(కుకునూరుపల్లి), సెప్టెంబర్ 11 : మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. బుధవారం కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. కొండపాక మండలంలోని మర్పడగ ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం, కుకునూరుపల్లితో పాటు మేదినిపూర్ అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు.

హెల్త్ అసిస్టెంట్‌పై కలెక్టర్ ఆగ్రహం

కుకునూరుపల్లి మండలం మేదినిపూర్ ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో జ్వరం కేసులు ఎన్ని నమోదయ్యాయి, వాటిలో డెంగీ కేసులు ఎన్ని అని వైద్య సిబ్బందిని ప్రశ్నించగా డెంగీ కేసులు ఒకటి కూడా నమోదు కాలేదని తెలిపారు. అనంతరం హెల్త్ సెంటర్‌లో మందులను పరిశీలించగా తేదీ దాటిన మందులు కనిపించడంతో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ దేవలక్ష్మిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తేదీ దాటిన మందులను ఉపయోగించవద్దని, ఆరోగ్య కేంద్రానికి అవసరమైన మందులను ముందస్తుగా తెప్పించుకోవాలని ఆయన ఆదేశించారు.

పూర్తి వివరాలు అందించాలి

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబర్ 11: ఆర్‌అండ్‌ఆర్ కాలనీల పూర్తివివరాలు అందించాలని కలెక్టర్ మనుచౌదరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సిద్దిపేట,గజ్వేల్ డివిజన్లలోని ఆర్‌అండ్‌ఆర్‌కాలనీల్లో సౌకర్యాలు, ఆయా కాలనీల్లో ఉంటున్న వారి వివరాలపై సమీక్షించారు.జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట, గజ్వేల్, ఆర్డీవోలు బన్సీలాల్, సదానందం,పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆదాయం పెంచేలా దిశానిర్దేశం

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబర్11: ఎస్‌హెచ్‌జీ మహిళల ఆదాయం పెంచేలా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ఉపయోగపడుతుందని సెర్ప్ సీఈవో దివ్య, డైరెక్టర్ ఆఫ్ ఫిషరీష్ ప్రియాంక ఆలా అన్నారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పశుసంవర్ధకశాఖల అధికారులకు వారు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘం మహిళల ఆదాయం పెంపొందించి వైవిధ్యభరితమైన ఉపాధి సృష్టిస్తూ మహిళలను వ్యాపార, పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరా మహిళాశక్తి కార్యక్రమాన్ని రూపకల్పన చేసిందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్, జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలి

సిద్దిపేటలో దీక్ష చేస్తున్న ఎస్సీవర్గీకరణ పోరాట సమితి నాయకులు

సిద్దిపేట, సెప్టెంబర్11: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని కోరుతూ ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద ఒక రోజు దీక్ష చేపట్టారు. పోరాట సమితి నాయకులు మద్దెల నర్సింహులు, గుడుమల సత్తయ్య, అల్లిబిల్లి నరసింహారావు, ర్యాకం శ్రీరాములు, బాల పోచయ్య, వెన్నె రాజు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అక్కడి నుంచి ముస్తాబాద్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టికల్ 341 పరిగణలోకి తీసుకోకుండా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు.దేశంలోని మెజార్టీ దళితులు, గిరిజనులు, పార్లమెంట్ సభ్యులు, అంబేద్కర్ యువజన సంఘాలు,బీఎస్‌పీ,ఎస్‌పీ, లోక్ జనశక్తి, సమతా సైనిక్ దళ్‌పార్టీలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఎస్సీ ఎస్టీలకు రాజకీయ అధికారం దూరం చేసే విధంగా తీర్పు ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ కులాల అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. నాయకులు దేవయ్య, ఎల్లేశ్, శ్రీనివాస్, సత్తయ్య, రవి, వివిధ గ్రామాల మహిళా కార్యకర్తలు, మలమహానాడు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థినులు నిరంతరం కష్టపడాలి

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 11: విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకొని వాటిని సాధించేందుకు నిరంతరం కష్టపడాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డేలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదన్నారు. ప్రిన్సిపాల్ రాణి, అధ్యాపకులు వనజ, రమాదేవి, వందన, రూపా, శారద, శ్రీనివాస్, లక్ష్మీ ప్రసాద్ పాల్గొన్నారు.

రాజీవ్ రహదారిపై స్టాపర్ బోర్డు ఏర్పాటు

కొడకండ్ల రాజీవ్ రహదారిపై స్టాపర్ బోర్డు ఏర్పాటు చేస్తున్న ఎస్సై శ్రీనివాస్

గజ్వేల్, సెప్టెంబర్ 11: మండలంలోని కొడకండ్ల ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రాజీవ్ రహదారిపై స్టాపర్ బోర్డు ఏర్పాటు చేయించాలని ఆ పాఠశాల హెచ్ఎం మధునాల శ్రీనివాస్ బుధవారం ప్రజ్ఞాపూర్‌లోని ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ పురుషోత్తంరెడ్డిని కలిసి విన్నవించారు. స్టాపర్ బోర్డు ఏర్పాటు చేయిస్తామని ఏసీపీ ఇచ్చిన హామీ మేరకు సాయంత్రం ఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో కలిసి స్టాపర్ బోర్డు ఏర్పాటు చేశారు.

ప్రమాదాల నివారణకు...

సిద్దిపేట టౌన్,సెప్టెంబర్ 11 : రోడ్డు ప్రమాదాల నివారణ,ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం పట్టణంలో ప్రధాన చౌరస్తాల్లో 100 బొల్లార్డ్స్ బిగించామని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు.పాత బస్టాండ్ వద్ద బిగించిన బొల్లార్డ్స్‌ను బుధవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై గోపాల్‌రెడ్డి,ఏఎస్సైలు సదాశివరావు, ఉమేశ్, రఘు.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ

సిద్దిపేటలో గురువారెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న మందపవన్

సిద్దిపేట, సెప్టెంబర్11: చరిత్రను బీజేపీ వక్రీకరిస్తున్నదని సీపీఐ జిల్లా కార్యదర్శి మందపవన్ ఆరోపించారు. బుధవారం తెలంగాణ రైతాంగ పోరాట 76వ వార్షికోత్సవాల సందర్భంగా సిద్దిపేటలో తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు, సిద్దిపేట తొలి ఎమ్మెల్యే ఎడ్ల గురువారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి వార్షికోత్సవాలను ప్రారంభించారు. అనంతరం గురువారెడ్డి భవన్‌లో తెలంగాణ సాయుధ పోరాట వీరుడు కామ్రేడ్ గాంబీరపు రాజయ్యను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బన్సీలాల్, కిష్టాపుర లక్ష్మణ్, పిట్ల మల్లేశం, చంద్రం, జేర్రి పోతుల జనార్దన్, సంగెం మధు, రామగళ్ల నరేశ్, మిట్టపల్లి సుధాకర్, బాలమోహన్ పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులకు న్యాయం చేయాలి

సిద్దిపేటలో నిరసన తెలుపుతున్న ఎస్సీ ,ఎస్టీ ఉద్యోగులు

సిద్దిపేట టౌన్,సెప్టెంబర్ 11 : మెరిట్ కం సీనియారిటీకి కారణమైన వివాదాస్పద జీవోల ఆర్డర్లను తక్షణమే రద్దు చేసి ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులకు న్యాయం చేయాలని ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర రీజినల్ అధ్యక్షుడు స్వామిదాస్ డిమాండ్ చేశారు. సిద్దిపేట విద్యుత్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..న్యాయమైన డిమాండ్ల కోసం నిరసన తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు కనకయ్య, రాజమల్లయ్య, లక్ష్మణ్, మల్లేశం, ప్రశాంత్,బాల నర్సయ్య పాల్గొన్నారు.

బావిలో వృద్ధురాలి మృతదేహం లభ్యం

మద్దూరు(ధూళిమిట్ట), సెప్టెంబర్11: నెల రోజుల క్రితం అదృశ్యమైన వృద్ధురాలు బావిలో శవమై తేలిన ఘటన బుధవారం మద్దూరు మండలం రేబర్తిలో చోటు చేసుకుంది. ఎస్సై షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గొట్టం నర్సమ్మ (80) జూలై 24వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైంది. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కోసం కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా దొరకకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గ్రామంలోని వంగపల్లి రోడ్డులోని కొంగర మల్లారెడ్డి అనే రైతు వ్యవసాయ బావిలో శవం ఉన్నట్లు గ్రామస్తులు గుర్తించి, కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. బావిలో లభించిన శవం నర్సమ్మదిగా కుటుంబసభ్యులు గుర్తించారు. నర్సమ్మ మృతదేహాన్ని బావి నుంచి వెలికితీసి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతురాలికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు చేయూత

మిరుదొడ్డిలో మృతుడి కుటుంబ సభ్యులకు బియ్యం అందజేస్తున్న నాయకులు

మిరుదొడ్డి, సెప్టెంబర్ 11 : మిరుదొడ్డి టౌన్‌కు చెందిన మల్లేశం మృతి చెందాడు. బుధవారం కాంగ్రెస్ నాయకులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి మోతె నాగ భూషణం సహకారంతో ఆర్థికసాయం, బియ్యం పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు రాజేశం, నాయకులు సుదర్శన్, రామకృష్ణ, కుమార్, నర్సింహులు పాల్గొన్నారు.

కొమురవెల్లిలో...

కొమురవెల్లి, సెప్టెంబర్ 11 : కొమురవెల్లి మండల కేంద్రానికి చెందిన లింగంపల్లి(మీసాల) మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం మృతుడి కుటుంబాన్ని సామాజిక కార్యకర్త గొల్లపల్లి ఆంజనేయులు పరామర్శించడంతో పాటు రూ.5వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట శ్రీనివాస్, లింగంపల్లి కనకరాజు, గజ్జే అశోక్, ఎక్కలదేవి రాజు, దేశెట్టి లక్ష్మణ్, ఆంజనేయులు ఉన్నారు.

జూనియర్ కళాశాలలో ప్రవేశాల సంఖ్యను పెంచాలి

బెజ్జంకిలో కళాశాలను తనిఖీ చేస్తున్న డీఐఈవో రవీందర్‌రెడ్డి

బెజ్జంకి, సెప్టెంబర్ 11: కళాశాలలో ప్రవేశాల సంఖ్యను పెంచాలని డీఐఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ దేవస్వామి, అధ్యాపకులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు గురుకుల విద్యార్థులు

దుబ్బాక, సెప్టెంబర్11: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు దుబ్బాక మండలం హబ్సీపూర్ మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 9న తుప్రాన్‌లోని ఆర్నాల్డ్ స్కూల్‌లో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా సబ్ జూనియర్ ఖోఖో పోటీలో 150 మంది విద్యార్థులను ఎంపిక చేశారని, ఇందులో హబ్సీపూర్ మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు రాహుల్, నందకిశోర్, సంజయ్ ఎంపికయ్యారన్నారు. ఈ నెల 13 నుంచి 15 వరకు హైదరాబాద్‌లోని మౌలాలిలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. పీఈటీ తరుణ్‌రాజ్‌ను ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వర్ రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

పీఆర్టీయూ నూతన కార్యవర్గాలు ఎన్నిక

ములుగు, సెప్టెంబర్ 11 : పీఆర్టీయూ మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు శశిధర్ శర్మ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. బుధవారం ములుగులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల అధ్యక్షుడు వెంకటనర్సింహారెడ్డి అధ్యక్షతన నూతన అధ్యక్షుడిగా పూడురి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బద్దం మనోహర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా గంగరాములు, మహిళా అధ్యక్షురాలిగా మాధవి, కార్యదర్శులుగా రమేశ్, మాధవి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాస్, అమర్‌నాథ్‌రావు, రంగారావు, శ్రీనివాస్‌రెడ్డి, జ్యోతి, వీణమ్మ పాల్గొన్నారు.

నారాయణరావుపేటలో..

నారాయణరావుపేట, సెప్టెంబర్ 11: పీఆర్టీయూ మండలశాఖ సర్వ సభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో పీఆర్టీయూ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎర్రవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొమ్మూరి పద్మ, మండల అసోసియేట్ అధ్యక్షుడిగా జి.శ్రీనివాస్‌రెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలిగా కల్యాణి, మండల కార్యదర్శిగా బాలకృష్ణారెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు హనుమారెడ్డి, రామచంద్రారెడ్డి, రవీందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పెరటి కోడి పిల్లలు పంపిణీ

కొండపాక(కుకునూరుపల్లి), సెప్టెంబర్ 11 : కొండపాక మండలం దుద్దెడలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా సభ్యులకు ఇబ్రో కంపెనీ ద్వారా పెరటి కోడి (అసిల్ రకం) పిల్లలను బుధవారం ఎంపీడీవో వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య ప్రతినిధులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని మహిళా సంఘాల సభ్యులకు ఆరు వారాల కోడి పిల్ల ఒకదానికి రూ.105 చొప్పున మొత్తం 2500 పెరటి కోడి పిల్లలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం అలీ, పంచాయతీ కార్యదర్శి చక్రపాణి, సీసీలు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితుల అరెస్ట్

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 11 : గంజాయి సేవిస్తూ అక్రమ రవాణా చేస్తున్న నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన సంఘటన సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ వివరాలు వెల్లడించారు. మండలంలోని పొన్నాల నుంచి రెండు మోటార్ సైకిళ్లపై గంజాయి సరఫరా చేస్తున్నారన్న సమాచారంతో మంగళవారం సాయంత్రం ఇందూర్ కళాశాల వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, నలుగురు వ్యక్తుల వద్ద గంజాయి ప్యాకెట్లు పట్టుబడినట్లు తెలిపారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని, పట్టుబడ్డ వారి వద్ద నుంచి రూ.1250 విలువ గల 50 గ్రాముల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెల